## బాధిత కుటుంబాలకు పరామర్శ

జైనథ్, జూలై 14 : మేడిగూడ గ్రామంలో కుటుంబ సభ్యులను కోల్పోయి బాధపడుతున్న బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను ఆదివారం మాజీ మంత్రి జోగు రామన్న పరామర్శించారు. మాజీ ఎంపీపీ మొట్టె జ్ఞానేశ్వర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మేడిగూడకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త ముక్తార్ అమ్మ మృతి చెందడంతో వారి స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. అనంతరం ఇదే గ్రామానికి చెందిన స్వల్ప గాయంతో ఇంటి వద్ద ఉంటూ విశ్రాంతి తీసుకుంటున్న కార్యకర్త పీఏస్ డైరెక్టర్ పోతారెడ్డిని పరామర్శించారు. పట్టణంలోని సుభాష్‌నగర్ వజ్రాల సుధాకర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.


కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

## నాగోబాను దర్శించుకున్న అడిషనల్ ఎస్పీ

ఇంద్రవెల్లి, జూలై 14 : కేస్లాపూర్‌లోని నాగోబా ఆలయంలో ఆదిలాబాద్ జిల్లా అదనపు ఎస్పీ సురేందర్‌రావు, ఎస్బీ డీఎస్పీ పోచారం శ్రీనివాస్‌రావులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశా రు. వీరిని మెస్రం వంశీయులు శాలువాతో స న్మానించారు. అనంతరం వారికి నాగోబా ఫొ టో అందజేశారు. ఈ సందర్భంగా కేస్లాపూర్ గి రిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్, సీఐ మొగిలి, ఎస్ఐ సునీల్, నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్‌పటేల్, మాజీ సర్పంచ్ మెస్రం నాగ్‌నాథ్, ఆలయ పూజారి మెస్రం షేకు పాల్గొన్నారు.


విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న అదనపు ఎస్పీ సురేందర్‌రావు

# కేసీఆర్ బొమ్మ ఉందని చెక్కుల నిలిపివేత

తాంసి(భీంపూర్), జూలై 14 : సీఎంఆర్ఎఫ్ చెక్కులపైన కేసీఆర్ బొమ్మ ఉందని వాటిని లబ్ధిదారులకు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఆపేసిందని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం కరంజి(టీ) గ్రామంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ముందుగా హస్సేన్-హుస్సేన్ దేవస్థానాన్ని దర్శించుకున్నారు. భీంపూర్ మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ఆరుగురు లబ్ధిదారులకు రూ.1.38 లక్షల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ చెక్కులను కేవలం కేసీఆర్ బొమ్మ ఉందని ఆపి పేదవారికి ఇబ్బంది పెట్టారని గుర్తు చేశారు. త్వరలోనే కరంజి గ్రామానికి రోడ్డు నిర్మాణం పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ నాగయ్య, మాజీ జడ్పీటీసీ సుధాకర్, మాజీ సర్పంచ్‌లు నరేందర్, లింబాజీ, నాయకులు కల్చప్, మహేందర్, ఉల్లాస్ పటేల్, నారాయణ, అఫ్రోజ్, సంతోష్ పాల్గొన్నారు.


బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

# మళ్లీ ఇథనాల్ లొల్లి

**పరిశ్రమ పనులను తిరిగి ప్రారంభించిన యాజమాన్యం**

- పార్లమెంట్ ఎన్నికలు పూర్తవగానే సీసీ కెమెరాల ఏర్పాటు
- ఆందోళనకు సిద్ధమవుతున్న అన్నదాతలు, ప్రజలు
- పార్టీలకు అతీతంగా యువత పోరాటం
- వాట్సాప్ గ్రూపుల్లో నాయకుల తీరును ఎండగడుతున్న గ్రామస్తులు
- సీఎం రేవంత్‌రెడ్డిని కలిసేందుకు ప్రణాళికలు

దిలావర్‌పూర్, జూలై 14 : నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్-గుండంపల్లి గ్రామాల మధ్య పంట పొలాల్లో నిర్మాణమవుతున్న ఇథనాల్ పరిశ్రమ పనులు మళ్లీ మొదలయ్యాయి. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఆగిన పనులు తిరిగి ప్రారంభం అవడంతో రైతన్నలు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. గతంలోనే దిలావర్‌పూర్, గుండంపల్లితోపాటు న్యాలోలం, బన్సపల్లీ, సాంగ్వీ గ్రామాల అన్నదాతలు, యువకులు వ్యతిరేకించారు. బైఠాయింపులు, ధర్నాలు, రాస్తారోకోలు, వంటవార్పులు చేస్తూ నిరసన తెలిపారు. చివరకు రైతులు పరిశ్రమ పనులను కూడా అడ్డుకున్నారు. పరిశ్రమ గోడలను కూల్చి వేశారు. ఇలా పరిశ్రమను అడ్డుకునేందుకు రైతులందరు ఒక్కటవ్వడంతో పరిశ్రమ యాజమాన్యం పనులను నిలిపివేసి వెళ్లిపోయింది. యాజమాన్యం 150 మంది రైతులపై కేసులు పెట్టించింది. చివరకు వివిధ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు పరిశ్రమ నిర్మాణాన్ని అడ్డుకుంటామని ప్రకటించారు.

### ఇథనాల్ పరిశ్రమ పనులు మొదలు..

పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఇథనాల్ పరిశ్రమ పనులను నిలిపివేసిన యాజమాన్యం ఎన్నికలు పూర్తవ్వగానే పనులను ప్రారంభించింది. పరిశ్రమతో కలిగే ప్రయోజనాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేయడంతో రైతులు ఆందోళలకు గురవుతున్నారు. ఈ పరిశ్రమ పనులు ప్రారంభమైతే తాము ఎలా బతికేదని ఆవేదన చెందుతున్నారు. గతంలో ప్రజలు కూల్చి వేసిన ప్రహరీకి తిరిగి మరమ్మతులు చేపడుతున్నారు. పరిశ్రమ భూమిలో పిచ్చి మొక్కలు పెరగడంతో వాటిని ట్రాక్టర్ సహాయంలో తొలిగించి రోడ్డును చదును చేస్తున్నారు. పరిశ్రమ వద్ద చుట్టూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

### నాయకుల తీరుపై అసంతృప్తి

గత పార్లమెంట్ ఎన్నికల ముందు పరిశ్రమ నిర్మాణాన్ని అడ్డుకుంటామని హామీ ఇచ్చిన రాజకీయ నాయకులపై ప్రజలు అసంతృప్తితో ఉన్నారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో మన ప్రతాపం చూపిస్తామని వాట్సాప్ గ్రూపుల్లో నాయకుల తీరును ఎండగడుతున్నారు. మనకు అండగా ఉండేందుకు ఒక్కరు కూడా ముందుకు రావడం లేదని ఆందోళన చెందుతున్నారు.


దిలావర్‌పూర్ పరిసర ప్రాంతంలో మళ్లి ప్రారంభమైన ఇథనాల్ పరిశ్రమ పనులు

మళ్లీ పార్టీలకు అతీతంగా పోరాటం చేసేందుకు సిద్ధమవుతున్నారు. గ్రామస్తులు అందరు కలిసి ముఖ్యమంత్రిని కలిసి సమస్యను వివరించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కాగా.. పరిశ్రమకు సంబంధించిన ఆస్తులను ధ్వంసం చేస్తే కేసులు తప్పవని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

### ఆందోళనకు సిద్ధమవుతున్న ప్రజలు

తమ పంటలు, ప్రాణాలను రక్షించుకునేందుకు తమదైన శైలిలో ఉద్యమం చేసేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారు. ఎట్టి పరిస్థితుల్లో తమ ప్రాంతంలో ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటు చేయకుండా శాంతియుతంగా ఉద్యమం చేసేందుకు ప్రజలు, మహిళలు, యువకులు, రైతులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పార్లమెంట్ ఎన్నికలు ముగిసే వరకు నిశబ్దంగా ఉన్న పరిశ్రమ యజమానులు ముగియగానే పనులు ప్రారంభం కావడంతో నాయకుల తీరుపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.


ఇథనాల్ పరిశ్రమ నిర్మాణ స్థలంలో మట్టి పోస్తున్న ట్రాక్టర్

## నిషేధిత పదార్థాల నియంత్రణకే తనిఖీలు

**ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల**

నిర్మల్ అర్బన్, జూలై 14 : నిర్మల్ జిల్లాలో నిషేధిత మత్తు పదార్థాలను పూర్తిగా నివారించేందుకు ఏకకాలంలో తనిఖీలను నిర్వహిస్తున్నామని ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ.. బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం సేవించినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. శాంతిభద్రతల రక్షణ, నేర, రోడ్డు ప్రమాదాల నియంత్రనే లక్ష్యంగా అన్ని పోలీస్ స్టేషన్‌లలో స్పెషల్ డ్రైవ్‌లను నిర్వహిస్తామని తెలిపారు. నిషేధిత గంజాయి అక్రమ రవాణాను నిరోధించడానికి నార్కోటిక్ విభాగంలో ప్రత్యేక శిక్షణ పొందిన రెండు పోలీసు జాగిలాలతో జిల్లా వ్యాప్తంగా బస్టాండ్లు, వ్యాపార సముదాయాలలో తనిఖీలు చేపడుతామని పేర్కొన్నారు. గంజాయి ఇతర మత్తు పదార్థాలను కనిపెట్టడంలో జాగిలాలు సమర్థవంతంగా పని చేస్తాయని తెలిపారు. ఎవరైనా నిషేధిత పదార్థాలను విక్రయిస్తే 8712659599 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు. శని, ఆదివారాల్లో నిర్వహించిన నాఖాబందీలో 664 కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఇందులో హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడుతున్న 565 మందిపై కేసులు నమోదయ్యాయి. ఓవర్ స్పీడ్ 1, డ్రంక్ అండ్ డ్రైవ్ 1, మైనర్ డ్రైవింగ్ 2, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా 7, సెల్‌ఫోన్ డ్రైవింగ్ 1, సీటు బెల్ట్ లేకుండా 5, రాంగ్ రూట్ డ్రైవింగ్ 9, ట్రిపుల్ రైడ్ 7, నంబర్ ప్లేట్ లేకుండా 66 కేసులు నమోదయ్యాయని తెలిపారు.


మాట్లాడుతున్న ఎస్పీ జానకి షర్మిల

# బీజేపీ ఆందోళన

- కాంగ్రెస్ నాయకుల తీరుపై నిరసన
- పోలీసు వాహనం ధ్వంసం
- ఇరువర్గాల మధ్య తోపులాట

ఆదిలాబాద్, జూలై 14(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీపై కౌన్సిల్ సభ్యులు పెట్టిన అవిశ్వాసం పోలీసులపై దాడికి కారణమైంది. ఇటీవల బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన వైస్ చైర్మన్ జహీర్ రంజానీపై కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మాన నోటీసును కలెక్టర్‌కు ఇచ్చారు. ఈనెల 18న కలెక్టర్ ఓటింగ్‌ను ఖరారు చేశారు. ఈ నేపథ్యంలో అవిశ్వాస పరీక్షలో తాము ఎలాగైనా గెలువాలంటూ కాంగ్రెస్ నాయకులు ఇతర పార్టీల నేతలకు భారీ నజరానాలతో తమ పార్టీలోకి చేర్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఆదివారం బీజేపీకి చెందిన 25 వార్డు కౌన్సిలర్ రాజేశ్‌ను తమ పార్టీలో చేర్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం కాంగ్రెస్ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. తమ కౌన్సిలర్‌ను అప్పగించాలంటూ కార్యాలయం లోపలికి వెళ్లడానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. కొందరు కార్యకర్తలు రాళ్లు విసరగా పోలీసు వాహన అద్దాలు పగిలిపోయాయి. పోలీసులు బీజేపీ కార్యకర్తలను లాఠీలతో చెదరగొట్టారు. కాంగ్రెస్ నియోజకవర్గం ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి బీజేపీ కౌన్సిలర్లను కిడ్నాప్ చేసి వారికి డబ్బులు ఇస్తున్నారని బీజేపీ నాయకులు ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి పోలీసులు అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ మండిపడ్డారు. పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.


పోలీసులు, బీజేపీ కార్యకర్తల మధ్య తోపులాట


ఆందోళనలో ధ్వంసమైన పోలీసుల వాహనం

# నువ్వు లేని జీవితం ఎందుకని..

**ప్రేమించిన అమ్మాయి దక్కలేదని యువకుడి ఆత్మహత్య**

- ప్రేమ విఫలం కావడంతో మనస్థాపానికి గురైన యువకుడు
- చికిత్స పొందుతూ మృతి.. గొడిసేర్యాల గ్రామంలో విషాదం

దస్తురాబాద్, జూలై 14 : ప్రేమించిన అమ్మాయి తనకి దక్కలేదని, అమ్మాయి లేని జీవితం వ్యర్థం అని, ప్రేమ విఫలం కావడంతో మనస్థాపానికి గురైన యువకుడు పానుగంటి పవన్(21) ఆత్మహత్యకు యత్నించాడు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఎస్ఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. గొడిసేర్యాల గ్రామానికి చెందిన పవన్ అదే గ్రామానికి చెందిన ఒక అమ్మాయి కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. ఇద్దరి కులాలు వేరు కావడంతో ఇంటి పెద్దలు వారి ప్రేమ వివాహనికి ఒప్పుకోలేదు. ఆ అమ్మాయికి నాలుగు నెలల క్రితం వేరే వివాహం చేయడంతో పవన్ మానసికంగా కృంగిపోయాడు. సుమారు నెల రోజుల క్రితం ఆ అమ్మాయి, యువకుడు కలిసి ఇద్దరి ఇష్టపూర్వకంగా హైదరాబాద్‌కు వెళ్లారు. కాగా.. భీర్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో అమ్మాయి మిస్సింగ్ అయినట్లు కేసు నమోదు చేశారు. హైదరాబాద్‌లో ఇరువురిని పట్టుకుని తీసుకొచ్చి కౌన్సెలింగ్ ఇచ్చారు. కొన్ని రోజులుగా ఇంటి వద్ద ఉంటున్న యువకుడు ఆ అమ్మాయి గురించి ఆలోచిస్తూ మనస్థాపానికి గురవుతున్నాడు. అమ్మాయి లేని జీవితం వ్యర్థం అని ఈ నెల 11వ తేదీ గురువారం సాయంత్రం 6 గంటల సమయంలో గొడిసేర్యాల గ్రామ శివారులో తను పురుగుల మందుతాగి చనిపోతున్నట్లు ఫోన్ ద్వారా తెలిపాడు. ఈ విషయాన్ని తన స్నేహితులు కుటుంబ సభ్యులకు సమాచారాన్ని అందించారు. వెంటనే ఘటనా స్థలానికి కుటుంబ సభ్యులు చేరుకుని యువకుడిని నిర్మల్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కొరకు నిజామాబాద్‌కి తరలించారు. పరిస్థితి తీవ్రం కాడవడంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఈ నెల 13వ తేదీన శనివారం రాత్రి 8 గంటల నుంచి 9 గంటల సమయంలో చనిపోయాడు. యువకుడి మేనమామ కట్కురి రాజేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా.. చేతికందిన కొడుకు ఆత్మహత్య చేసుకోవడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. విషాద ఛాయలు అలుముకోగా.. కడసారి చూసేందుకు జనం భారీ సంఖ్యలో తరలివచ్చారు.


పానుగంటి పవన్(ఫైల్)

## మొహర్రం సందడి

ఇంద్రవెల్లి, జూలై 14 : మొహర్రం ఉత్సవాలను ప్రజలు ఘనంగా జరుపుకుంటున్నారు. ఆదివారం గోంగర్‌గాం, కైలాస్‌నగర్, మూత్నూర్, ధనోరా(బి), గౌరాపూర్, వడగాం, కేస్లాపూర్ గ్రామాలు, మండల కేంద్రంలోని బజార్‌గల్లి, దేవాపూర్, ఏమాయికుంట, అంజీ, వాల్గొండ, ధోబీగూడ, టేకిడిగూడ, తుమ్మగూడ, పిట్టబొంగురం, మర్కాగూడలో ఏర్పాటు చేసిన పీరీలను ఊరేగించారు. పీరీలను భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. భక్తులు రాత్రివేళల్లో డప్పుచప్పుళ్ల మధ్య నృత్యాలు చేస్తూ సందడి చేశారు. మొహర్రం ఉత్సవాలను భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు.


మండల కేంద్రంలో పీరీలను ఉరేగిస్తున్న భక్తులు


